RNI. No. APTEL/2011/41055





# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 277 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం బుధవారం, 10 ఏప్రిల్ 2024 పేజీలు : 4 వెల : 2/-



# ఎవరెటో?

# 'అయ్యో'మయం

## ఎన్నికల వేళ బీఆర్ఎస్‌లో గందరగోళం

- కాంగ్రెస్‌లోకి మరికొందరు ఎమ్మెల్యేలు - కాంగ్రెస్ 'ఆపరేషన్ ఆకర్ష్'తో అనుమానాలు

- కారులోనే ఉంటామంటూ రాత్రికిరాత్రే జంప్ - త్వరలో హస్తం గూటికి నగర మాజీ మంత్రి?

హైదరాబాద్ : అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత గ్రేటర్ బీఆర్ఎస్‌లో అత్యంత గందరగోళం నెలకొన్నది. అధిష్ఠానమే మాకు ఫైనల్ అని మొన్నటి వరకు బీరాలు పలికిన వారు నేడు 'కారు' దిగి హస్తం పార్టీలో చేరిపోతున్నారు. అధికార కాంగ్రెస్ 'ఆపరేషన్ ఆకర్ష్'కు తెరతీయడంతో నగరానికి చెందిన ఎమ్మెల్యేలు, కీలక నేతలు గులాబీ పార్టీని వీడేందుకు రెడీ అవుతున్నారు. ఇప్పటికే మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి దంపతులు, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడంతో 'కారు'లో ఎవరుంటారో? ఎవరు దిగుతారో? అన్న అయోమయం నెలకొన్నది.

**రోజుకో పేరు తెరపైకి..** అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ త్వరలో కారు దిగి కాంగ్రెస్‌లో చేరుతారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. దీనిపై ముందే స్పందించిన నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు కాలేరును పార్టీలోకి తీసుకోవద్దని రాష్ట్ర నేతలను గట్టిగా డిమాండ్ చేశారు. ఆయన కాంగ్రెస్ లోకి రావాలనుకుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రావాలని పట్టుబడుతున్నారు. ఆయనతోపాటు మరికొందరు ఎమ్మెల్యేలు, ఓ మాజీ మంత్రి కూడా బీఆర్ఎస్‌ను వీడుతారనే ఊహాగానాలు వెలువడుతున్నాయి.

**బలోపేతమే కాంగ్రెస్ లక్ష్యం :** గ్రేటర్‌లో కాంగ్రెస్ ప్రాతినిధ్యం లేదు. మొత్తం 24 స్థానాలుండగా బీఆర్ఎస్-16, ఎంఐఎం-7, బీజేపీ-1 విజయం సాధించాయి. దీంతో మహా నగరంలో బలోపేతమే లక్ష్యంగా కాంగ్రెస్ 'ఆపరేషన్ ఆకర్ష్'కు తెరలేపింది. పార్టీ మారుతారంటూ నగరానికి చెందిన పలువురు గులాబీ శాసనసభ్యుల పేర్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. మేం బీఆర్ఎస్?ను వీడేది లేదని ఎమ్మెల్యేలు చెబుతున్నా..ఎప్పుడు ఏం జరుగుతుందో అన్న అనుమానం పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది.

అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తన పూర్వాశ్రమం కాంగ్రెస్‌లో తిరిగి చేరుతారని ప్రచారం జరుగుతున్న వేళ.. నియోజకవర్గ హస్తం నేతలు వ్యతిరేకిస్తున్నారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు మద్దతుగా అంబర్‌పేటలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాదయాత్ర నిర్వహించడం గమనార్హం. ఈసమయంలో పార్టీ మారుతారని ప్రచారం జరగడంతో దీంతో పార్టీ లో ఉ ంటారా? వెళ్తారా? అని ఆయన అనుచరులు చర్చించుకుంటు న్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రచారం చేయాల్సిన వేళ ఇలాంటి పరిస్థితి ప్రభావం చూపుతుందని సీనియర్ నేతలు అభిప్రాయ పడుతున్నారు.




## చేవెళ్లలో సత్తా చాటేందుకు ప్రధాన పార్టీల వ్యూహాలు..!

**రంగారెడ్డి జిల్లా చేవెళ్ల లోక్‌సభ స్థానాన్ని గెలిచేందుకు ప్రధాన పార్టీలు సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. భారాస, భాజపాలు ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించి ప్రచారంలో దూసుకుపోతుండగా.. సిట్టింగ్ ఎంపీని పార్టీలోకి చేర్చుకుని కాంగ్రెస్ బరిలోకి దూకింది. పరస్పర మాటల యుద్ధంతో చేవెళ్లలో రాజకీయం వేడెక్కింది.**

## లోకల్ వర్సెస్ నాన్ లోకల్... సిటీలో పోస్టర్ల కలకలం!




ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రత్యర్థులను టార్గెట్ చేయడానికి.. ఆయా అభ్యర్థులు రకరకాల అంశాలను లేవనెత్తుతుంటారనేది తెలిసిన విషయమే! సాధారణంగా... తాను గొప్పవాడిని, మంచి వాడిని అని చెప్పే స్థానంలో... ప్రత్యర్థి గొప్పవాడు కాదు, చెప్పడ్డవాడు అని చెప్పడం పరిపాటిగా మారిందని అంటున్నారు! పైగా ఇటీవల కాలంలో లోకల్, నాన్ లోకల్ అనే అంశం కూడా ఎన్నికల పోటీలో అతిముఖ్యమైన అంశాల్లో ఒకటిగా ఉందని అంటున్నారు! రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ పలు నియోజకవర్గాల్లో నాన్ లోకల్ అభ్యర్థులకు ఆదరణ చాలా తక్కువగా ఉంటుందని.. స్థానికులకే ఆయా నియోజకవర్గాల ప్రజానికం పూర్తిగా మద్దతు తెలుపుతారని.. అభ్యర్థులంతా స్థానికులే అయితే అప్పుడు మిగిలిన అంశాలపై ఫిల్టరింగ్ జరుగుతుంటుందని చెబుతుంటారు. ఈ నేపథ్యంలో తాజాగా మల్కాజిగిరీ లోక్ సభ స్థానానికి సంబంధించి ఈ లోకల్ - నాన్ లోకల్ అంశానికి సంబంధించి ఇప్పుడు ఒక ఫోటో వైరల్ గా మారింది. అవును... మల్కాజిగిరి లోక్ సభ స్థానంలో మూడు పార్టీల మధ్య పోరు రసవత్తరంగా మారింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ లో సత్తా చాటలేకపోయామని.. అందువల్ల ఈ ఎన్నికల్లో మల్కాజిగిరీ లోక్ సభ స్థానాన్ని కైవసం చేసుకుంటే ఆ ఏడు నియోజకవర్గాలూ గెలిచినట్లే అన్నట్లుగా కాంగ్రెస్ భావిస్తోందని అంటున్నారు. మరోపక్క గ్రేటర్ లో కారు ఎప్పుడు జోరు మీదే ఉ ంటుందని చెప్పాలని బీఆరెస్స్ భావిస్తోందని చెబుతున్నారు. ఇంకోపక్క ఈసారి కూడా గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే భావిస్తోన్న నేపథ్యంలో... మల్కాజిగిరి గెలిచి మోడీకి గిఫ్ట్ ఇవ్వాలని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారని అంటున్నారు.

ఈ సమయంలో అనూహ్యంగా లోకల్ - నాన్ లోకల్ పోస్టర్ ఒకటి వెలిసింది. ఈ పోస్టర్ లో రానున్న ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల పేర్లతో పాటు వారు.. ఈ నియోజకవర్గ ప్రజలకు ఎంత దూరంలో నివాసాలను కలిగి ఉన్నారన్నే విషయాలను పొందుపరచబడి ఉంది! ఇందులో భాగంగా... బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటలను కలవాలంటే (హైదరాబాద్ టు హుజూరాబాద్) 166 కి.మీ., కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సునీతను కలవాలంటే (హైదరాబాద్ టూ చేవెళ్ల) 59 కి.మీ. దూరం వెళ్లాలి. అదే బీఆరెస్స్ అభ్యర్థి లక్ష్మారెడ్డిని కలవాలంటే (రాగిడి) సున్నా కి.మీ. పక్కా లోకల్ అని రాసిఉన్న పోస్టర్ దర్శనమిచ్చింది. దీంతో... ఈ పోస్టర్ ఇప్పుడు వైరల్ గా మారింది!

# 'పార్లమెంటుపై పట్టు హస్తానిదే'

## ఒకట్రెండు సీట్లలోనే బీఆరెస్ గెలుపు? - రెండు మూడు స్థానాల్లోనే బీజేపీ!

## ఇంకా రిపేర్లు పూర్తి చేసుకోని కారు!

## హైప్ క్రియేట్ చేసే యత్నాల్లో బీజేపీ!!




హైదరాబాద్ : మరో 40 రోజుల్లో లోక్‌సభ ఎన్నికలకు తెలంగాణలో పోలింగ్ నిర్వహించనున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆరెస్‌తోపాటు.. బీజేపీ సైతం ప్రచారంలో నిమగ్నమయ్యాయి. అధికార పార్టీగా ఈ ఎన్నికల్లో అత్యధిక స్థానాలను చేజిక్కించుకుంటామన్న విశ్వాసంతో కాంగ్రెస్ ఉన్నది. మరోవైపు బీఆరెస్ నుంచి ఇతర పార్టీల్లోకి వలసలు ఉంటున్నప్పటికీ.. పార్టీ అధినేత జనం మధ్యకు రావడంతో ఆ గులాబీ శ్రేణుల్లో కాస్తంత ఉత్సాహం కనిపిస్తున్నది. అసెంబ్లీ ఎన్నికల్లో భారీగా దెబ్బతిన్న కారు.. ఇంకా పూర్తి స్థాయిలో రిపేర్లు పూర్తిచేసుకోకుండా లోక్‌సభ ఎన్నికలకు రోడ్డెక్కాల్సిన పరిస్థితి కనిపిస్తున్నది. దీనికి తోడు ఆ పార్టీ నుంచి కీలక నేతలు బయటకు వెళ్లిపోతుండటం కూడా కలవరానికి గురిచేస్తున్నది. కొన్ని ప్రాంతాల్లో మినహా రాష్ట్రవ్యాప్తంగా బలంగా లేని బీజేపీ సైతం ఏదో జరిపోతుందన్న భ్రమలు కల్పిస్తూ, మోదీ చరిష్మాతో అన్ని చోట్ల తమదే గెలుపని చెప్పుకొంటూ హైప్ క్రియేట్ చేసే ప్రయత్నాల్లో ఉన్నది. అదే సమయంలో రాజకీయ చదరంగంపై ఎక్కువ దృష్టిపెట్టిన కాంగ్రెస్ పార్టీ.. ప్రజలు ఎదుర్కొంటున్న అతి కీలకమైన సాగు, తాగునీటి సమస్యను సకాలంలో పరిష్కరించడంలో విఫలమైందన్న అభిప్రాయాలు సైతం వినిపిస్తుండటం గమనార్హం. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో ఏర్పడిన కరువును అధిగమించే చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని పలువురు అంటున్నారు. ఇది ప్రతిపక్షాలకు ప్రధాన అస్త్రంగా కనిపిస్తున్నది. బీఆరెస్ నేతలు ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు అని చెబుతున్నా.. కరువు సంకేతాలు అసెంబ్లీ ఎన్నికలకు ముందు నుంచే ఉన్నాయి. తాము మిషన్ భగీరథ ద్వారా అన్నిగ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పించామని బీఆరెస్ నేతలు చెబుతున్నా.. వాస్తవానికి అనేక గ్రామాలకు పైప్‌లైన్‌లు లింక్ కాలేదు. దీంతో చాలా గ్రామాలకు సురక్షిత తాగునీరు అందడం లేదు. మరోవైపు రిజర్వాయర్లలో తాగునీటి వరకు ఎలాంటి ఇబ్బంది లేకున్నా.. సరైన యజమాన్య పద్ధతులు అవలంబించకపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడింది. దీనిపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించి కొద్దిపాటి నిధులు విడుదల చేసి, గ్రామాలకు నీళ్లు వచ్చేలా చేస్తే చాలన్న అభిప్రాయం సర్వత్రా వెలువడుతోంది. దీనిని కాంగ్రెస్ ఎలా పరిష్కరిస్తుందనే అంశం కూడా ఎన్నికల్లో ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయని పరిశీలకులు అంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మొదటి పదేళ్లు అధికారంలో ఉ న్న బీఆరెస్ తన ప్రత్యర్థి పార్టీలను బలహీనపర్చే ఎత్తుగడలను అనుసరించింది. 2014లో గెలిచిన తరువాత రాష్ట్రంలో బలమైన పార్టీగా ఉన్న టీడీపీ ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకొని టీడీఎల్‌పీనే విలీనం చేసుకున్నది. ఇదే తీరుగా 2018లో గెలిచిన తరువాత మెజార్టీ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకొని సీఎల్‌పీని విలీనం చేసుకున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తమకు ఏ మాత్రం ప్రత్యామ్నాయం కాదని బీఆరెస్ బహాటంగానే ప్రకటించింది. కానీ 2023 ఎన్నికల్లో సీన్ రివర్స్ అయి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. తదుపరి మూడు నెలల్లోనే రాజకీయ పరిణామాలు పూర్తిగా తారుమారయ్యాయి. బీఆరెస్ నుంచి కాంగ్రెస్‌లోకి వలసలు పెరిగి పోయాయి. రాజకీయ కురువృద్ధుడు కే కేశవరావు బీఆరెస్ సెక్రటరీ జనరల్ పదవికి రాజీనామా చేసి.. తన కుమార్తె, గ్రేటర్ హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మితో కలిసి కాంగ్రెస్‌లో చేరిపోయారు. బీఆరెస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్ ఆ పార్టీకి రాజీనామా చేసి, కాంగ్రెస్ తరఫున సికింద్రాబాద్ అభ్యర్థిగా నిలిచారు. చేవెళ్ల నుంచి పోటీ చేస్తున్న గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, వరంగల్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కావ్య, గ్రేటర్ హైదరాబాద్ మాజీ మేయర్ బొంతురామ్మోహన్ తదితరులు బీఆరెస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఇంకా అనేక మంది నాయకులు, ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరడానికి క్యూ కడుతున్నారన్న చర్చ జరుగుతోంది. ఇదే జరిగితే కాంగ్రెస్‌కు గట్టి ఊపు వచ్చే అవకాశం ఉందన్న చర్చ రాజకీయ వర్గాలలో జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తరువాత బీఆరెస్ డీలా పడటంతో కాంగ్రెస్ మరింత బలపడింది. బీఆరెస్ స్థానాన్ని బీజేపీ ఆక్రమించే ప్రయత్నం చేసినా సఫలం కాలేదన్న అభిప్రాయాలు ఉన్నాయి. ప్రస్తుతం 2018 ఎన్నికల తరువాత కాంగ్రెస్‌కు ఎలాంటి పరిస్థితి ఏర్పడిందో ప్రస్తుతం బీఆరెస్‌కు అలాంటి పరిస్థితే ఉందన్న చర్చ జరుగుతోంది. ఇటువంటి రాజకీయ పరిస్థితుల మధ్య తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల్లో ఏ నియోజకవర్గంలో ఏ పార్టీ బలంగా ఉన్నది? ఎవరికి విజయావకాశాలు ఉన్నాయి? అన్న అంశాలే ఏ నలుగురు కలిసినా చర్చలో ఉంటున్నాయి. సాధారణ ఓటరు ఏవైపు ఆలోచిస్తున్నారు? ఆయా నాయకుల సానుకూల అంశాలు, ప్రతికూల అంశాలు ఏమిటో తెలుసుకోవడానికి విధాత క్షేత్రస్థాయి పరిశీలన చేసింది. పలువురు విశ్లేషకులతో చర్చించింది. సాధారణ ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నది. తెలంగాణ రాష్ట్రాన్ని మూడు భాగాలుగా విభజించి పరిశీలిస్తే దక్షిణ తెలంగాణలో పూర్తిగా కాంగ్రెస్ పార్టీ గెలిచే అవకాశాలున్నట్లు నియోజకవర్గాలవారీగా చర్చ జరుగుతోంది. కాగా ఉత్తర తెలంగాణలో కాంగ్రెస్ వర్సెస్, బీఆరెస్, బీజేపీల మధ్య రసవత్తర త్రిముఖ పోటీ జరిగే అవకాశం ఉందని అంటున్నారు. ఇక్కడ మూడు పార్టీలు సీట్లను పంచుకునే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని నాలుగు పార్లమెంటు స్థానాలను పరిశీలిస్తే మూడు స్థానాల్లో కాంగ్రెస్, బీజేపీ గెలుపు కోసం హోరా హోరీగా పోరాటం చేయనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా అర్బన్, సెబీ అర్బన్ నియోజకవర్గాలైన సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్లలో బీఆరెస్ నుంచి వలస వచ్చిన లీడర్లకే కాంగ్రెస్ పార్టీ టికెట్లు ఇవ్వడం పట్ల ఒకింత అనాసక్తత వ్యక్తమవుతోంది.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## ఉత్తరాన చెల్లెలు.. దక్షిణాదిన అన్న.. అగ్ర నేతల బాధ్యతలు

వచ్చే లోక్ సభ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి చావోరేవో. ఈసారి గనుక పరాజయం పాలైతే ఆ పార్టీకి ఇక మరింత కష్టకాలం తప్పదు. ఓ వైపు ప్రధాని మోదీ హ్యాట్రిక్ అంటూ కలవరిస్తున్నారు. గతంలో ఎప్పుడో విడిపోయిన మిత్రపక్షాలను కలుపుకొంటున్నారు. ప్రత్యర్థులను బలహీనం చేస్తున్నారు. ఇంకా గట్టిగా చెప్పాలంటే ప్రత్యర్థులను శత్రువుల్లా చూస్తూ జైళ్లలో పెడుతున్నారు. ఇలాంటి సమయంలో కాంగ్రెస్ గనుక వచ్చే ఎన్నికల్లో విజయం సాధించకుంటే మరో ఐదేళ్లు ఆ పార్టీని మిత్రపక్షాలు కూడా పెద్దగా పట్టించుకోవు.

**అక్కడ ఆమె..** కాంగ్రెస్ పార్టీ తరపున ఈ ఎన్నికల్లో సోనియా గాంధీ పూర్తి స్థాయి ప్రచారం చేసే పరిస్థితి లేదు. అనారోగ్యం, వయోభారం ఆమెను ఇబ్బందిపెడుతున్నాయి. దీంతో బాధ్యతంతా కుమారుడు రాహుల్ గాంధీ, కుమార్తె ప్రియాంక గాంధీ వాద్రా మీదనే ఉందనడంలో సందేహం లేదు. వీరిద్దరూ ఎన్నికల కురుక్షేత్రాన్ని తొలిసారిగా తల్లి పాత్ర పూర్తిస్థాయిలో లేకుండా ఎదుర్కొంటున్నారు. ఇలాంటి సందర్భంలో బాధ్యతలను కూడా పంచుకున్నట్లు స్పష్టమవుతోంది. ప్రియాంక పూర్తిగా ఉత్తరాదిన ఎన్నికలను చూస్తున్నారు. ఆమె తమ కుటుంబ నియోజకవర్గం అయిన రాయ్ బరేలీ నుంచి పోటీ చేసే అవకాశం కూడా ఉంది. తల్లి సోనియా 20 ఏళ్లకు పైగా ఇక్కడినుంచి ప్రాతినిధ్యం వహించారు. ప్రియాంక భర్త రాబర్ట్ వాద్రా కూడా అమేఠీ నుంచి పోటీ చేస్తానని సంకేతాలిచ్చారు. ఈ స్థానంలో రాహుల్ 2004 నుంచి 2014 వరకు గెలుపొందారు. 2019లో అమేఠీలో ఓడినా వాయనాడ్ నుంచి నెగ్గారు. ఈ నేపథ్యంలోనే ప్రియాంక కీలకమైన ఉత్తరాది బెల్ట్ లో కాంగ్రెస్ ప్రచారం, ఎన్నికల సరళిని పర్యవేక్షించే చాన్సుంది.

**ఇక్కడ ఈయన..** రాహుల్ గాంధీ.. వచ్చే ఎన్నికల్లోనూ కేరళలోని వాయనాడ్ నుంచి బరిలో దిగుతున్నారు. మరోచోట నుంచి పోటీ చేసేదీ లేనిదీ తెలియరాలేదు. అయితే, అమేఠీ బరిలో ఉంటారని భావించినా.. పూర్తిస్థాయి ఫోకస్ మాత్రం దక్షిణాదిపై ఉంచారని స్పష్టం అవుతోంది. ఇక రాహుల్ ఇప్పటికే తెలంగాణలో పలుసార్లు పర్యటించారు. ఇక్కడివారికి బాగా దగ్గరయ్యారు. ఏపీలోనూ ఆయన పార్టీని పునరుజ్జీవింపజేసే పనిలో ఉన్నారు. తమిళనాడు ఎలాగూ డీఎంకే వంటి గట్టి పార్టీ ఉంది. కేరళలో స్వయంగా బరిలో దిగారు. ఇక కర్ణాటక గురించి చెప్పాల్సిన పనిలేదు. అక్కడ ఆ పార్టీనే అధికారంలో ఉంది. కొసమెరుపు: అన్నాచెల్లెళ్లు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల్లో రాహుల్ పరిస్థితే కొంచెం బెటర్. ఎందుకంటే.. దక్షిణాదిన బీజేపీ కర్ణాటకలో తప్ప ఎక్కడా బలంగా లేదు. దీంతో ఇక్కడినుంచి ఇండియా కూటమి అధిక సీట్లు సాధించడం ఖాయం.

# రాంజీ గోండు ఆశయాల సాధనకు కృషి చేద్దాం..!

**ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్.**







**ఉట్నూర్ ఏప్రిల్ 9(ప్రభాత సమాచారం**
స్వాతంత్ర్య సమరయోధుడు, ఆదివాసి హక్కులకై పోరాడిన రాంజీ గోండు ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలనీ ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం ఉట్నూర్ మండలంలోని లక్కారాం గ్రామంలో మర్సుకోల రాంజీ గోండు 164వ వర్ధంతి సభలో పాల్గొన్నారు. ముందుగా రాంజీ చౌక్ ను ప్రారంభించి,రాంజీ గోండు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాంజీ గోండు దేశం కోసం,ఈ ప్రాంత ప్రజల కోసం చేసిన కృషి మరువలేనిదన్నారు. ప్రతి ఒక్కరూ రాంజీ గోండు స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను, ముఖ్యంగా నీటి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చెపడతామన్నారు. ఎన్నికల అనంతరం అర్హులైన పివిటిజి లకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని తెలిపారు. త్వరలో రాంజీ గోండు విగ్రహన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి,అడిషనల్ డిఎంఎచ్ఓ మనోహర్, మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు భుజంగరావ్,రాజ్ గోండు సేవ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విషంరావ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సబ్బండ వర్గాల ప్రజల అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తాం...!

**ఉగాది పర్వదినం సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే**
**ఉట్నూర్ పట్టణంలో నూతన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రారంభం**







**ఉట్నూర్ ఏప్రిల్ 9(ప్రభాత సమాచారం )**
సబ్బండ వర్గాల ప్రజల అభివృద్దే లక్ష్యంగా కృషి చేస్తామని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం ఉగాది పర్వదినం సందర్భంగా ఉట్నూర్ మండల కేంద్రంలో నూతన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని కుటుంబ సభ్యులు మరియు కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఖానాపూర్ నియోజకవర్గ ప్రజలు పేదవాడినైనా తనకు ఎమ్మెల్యే చేసినందుకు ధన్యవాదాలు తెలుపుతూ..ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఎల్లవేళలా కృషి చేస్తానని అన్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండి,పాడి పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అన్ని దానాల్లోకి అన్నదానం గొప్పది: బెల్లంపల్లి ఏ సి పి రవికుమార్



**బెల్లంపల్లి,ఏప్రిల్ 10( ప్రభాత సమాచారం)**
జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో జనహిత అన్నపూర్ణ తృతీయ వార్షికోత్సవం మరియు ఉగాది పర్వదినం సందర్భంగా దాత జనహిత సభ్యులు జక్కుల స్వప్న-శ్రీనివాస్ గౌడ్ దంపతులచే నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బెల్లంపల్లి ఏ సిపీ రవి కుమార్ హాజరై ప్రజలకి ఉగాది శుభాకాంక్షలు తెలిపి ఉగాది పచ్చడి పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ మాట్లాడుతూ అన్ని దానాల్లోకి అన్నదానం గొప్పదని మూడు సంవత్సరాలు గా నిరుపేదలు బాటసారుల ఆకలి తీర్చేందుకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తూ మరియు ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న జనహిత సభ్యులని దాతల ని అభినందించారు. ఈ కార్యక్రమంలో జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ అన్ని దానాల్లోకి అన్నదానం గొప్పదని ఆకలి తో ఉన్నవారి ఆకలి తీర్చడం సంతోషంగా ఉందని దాతల సహకారంతో జనహిత అన్నపూర్ణ అన్నదాన కార్యక్రమం ఉగాది సందర్భంగా ఏప్రిల్ 13 వ తేదీ 2021 న ప్రారంబించడం జరిగిందని దాతల సహకారంతో ప్రతి బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఈ రోజు ఉగాది పర్వదినం మరియు జనహిత అన్నపూర్ణ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా 237 వ సారి దాత జనహిత సభ్యులు జక్కుల స్వప్న-శ్రీనివాస్ గౌడ్ దంపతులచే అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఇప్పటి వరకు అన్నదాతలు, జనహిత అన్నపూర్ణ శాశ్వత అన్నదాతల సహకారంతో 237 సార్లు సుమారు 16 లక్షల రూపాయల వ్యయంతో కొన్ని వేల మంది ఆకలి తీర్చడం సంతోషమని ఇందుకు సహకరిస్తున్న అన్నదాతలకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దాత జక్కుల శ్రీనివాస్ గౌడ్, జనహిత సేవా సమితి ప్రధాన కార్యదర్శి ఇప్ప రవి, కోశాధికారి కొడిపెల్లి గిరిప్రసాద్, గౌరవ సలహాదారులు మురుకూరి బాలాజీ, సాంబారి నర్సయ్య, కందుల రాజన్న, కార్యవర్గ సభ్యులు పన్నాల సదానందం, బియ్యాల గణేష్,నిచ్చకోల గురుస్వామి, జెడల అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

# కూ..చక చక

హైదరాబాద్: అమృత్ భారత్ రైల్వే స్టేషన్ పథకంలో భాగంగా నగరంలోని స్టేషన్లు కొత్త అందాలు సంతరించుకుంటున్నాయి. హైటెక్ సిటీ స్టేషన్ పనులు 70 శాతం పూర్తయ్యాయి. హాఫీజ్‌పేట, మలక్‌పేట, ఉప్పుగూడ, మల్కాజిగిరి, బేగంపేట స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నారు. హైటెక్‌సిటీ స్టేషన్ ప్రారంభానికి సిద్ధమవుతోంది. సికింద్రాబాద్‌లో చురుగ్గా సాగుతున్నాయి. హైదరాబాద్, కాచిగూడలో పునరాభివృద్ధి పనులు ప్రారంభం కావాల్సి ఉంది. రూ.350 కోట్లతో చేపట్టిన చర్లపల్లి ప్రారంభానికి సిద్ధమైంది.

సిద్ధమవుతున్న స్టేషన్లు..
హైటెక్‌సిటీ రైల్వేస్టేషన్లో ప్లాట్‌ఫామ్‌పై మొత్తం పైకప్పు వేశారు. ఐటీ కారిడార్ వైపు భవన నిర్మాణ పనులు 80శాతం పూర్తయ్యాయి. ఇరువైపులా లిఫ్టులు, పాదచారుల వంతెన ఉండగా.. ఎస్కలేటర్ల ఏర్పాటుకు పిల్లర్లు నిర్మించారు. బేగంపేటలో అదనపు భవనాలు, పాదచారుల వంతెనల పనులు 40 శాతం పూర్తయ్యాయి. మల్కాజిగిరిలో తాజాగా రూ.27 కోట్ల విలువైన పనులు చేపట్టారు. బేగంపేట స్టేషన్ అభివృద్ధికి రూ.26.55 కోట్లు కేటాయించారు.

లోకల్ రైళ్లు, ఎక్స్‌ప్రెస్‌లు ఆగేలా..
ప్రస్తుతం చిన్నస్టేషన్లలో ఎంఎంటీఎస్‌లు మాత్రమే ఆగుతున్నాయి. దూరప్రాంతాలకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లు పలు స్టేషన్లలో ఆగేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. 24 బోగీల రైలుకు సరిపడా ప్లాట్‌ఫాంలు.. ఆ మేరకు పైకప్పులు రానున్నాయి. ఎంఎంటీఎస్ స్టేషన్లకు ఇరువైపుల చేరుకునేలా రోడ్లు అభివృద్ధి చేస్తారు. కొత్త వంతెనలు నిర్మిస్తారు.

# నీటి సంక్షోభం.. అప్రమత్తతే మార్గం

ఇందూరు : కేప్‌టౌన్... బెంగళూరు, చెన్నై, లాతూర్.. ఆ తర్వాత ఏ ప్రాంతం.. ఇలా ఏడాదికి ఒక నగరం, పట్టణం జల సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. తాగునీటి సమస్య అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశమవుతోంది. ప్రస్తుతం బెంగళూరు నగర నీటి సంక్షోభం దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వాలను అప్రమత్తం చేసింది. సిలికాన్ సిటీ సమస్యతో కేప్‌టౌన్ నగరం పేరు తెరమీదకు తీసుకొస్తున్నారు. అక్కడ ఆరేళ్ల కిందట తలెత్తిన నీటి సంక్షోభం ప్రపంచంలోనే తీవ్రమైనదిగా పరిగణిస్తుంటారు. ప్రస్తుతం బెంగళూరు నగరవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను చూసి గుణపాఠాలు నేర్చుకోవాలన్నది నిపుణుల సూచన.

దుర్వినియోగం చేశారని జరిమానా..
మునుపెన్నడూ లేని విధంగా బెంగళూరు నగరాన్ని నీటి సంక్షోభం వణికిస్తోంది. ఇటీవల నీరు దుర్వినియోగం చేశారని కాలనీ సంక్షేమ సంఘం పెట్టుకున్న నియమం మేరకు 22 మందికి రూ.5 వేల చొప్పున జరిమానా విధించారు. అక్కడి ప్రజల రోజువారీ కార్యకలాపాలపై ఎద్దడి ప్రభావం చూపించింది. నీటి కోసం గంటల తరబడి వరుసలో నిలబడాల్సిన పరిస్థితి. ఎండిపోయిన జలాశయాలు, అడుగంటిన భూగర్భ జలాలు ఈ దుస్థితికి కారణమైంది. వానాకాలమైతే వీధులు, కాలనీలన్నీ నీట మునిగి అడుగు పెట్టనీయని పరిస్థితిని చూసిన నగరం.. అవే కాలనీల ప్రజలు నీటి కోసం పరుగులు తీస్తున్నారు.

కారణాలు ఏంటి?
ఎక్కడ నీటి సంక్షోభం తలెత్తినా దానికి మానవ తప్పిదాలే కారణమన్నది సుస్పష్టం. వాతావరణం మార్పులకు గురి కావడానికి మనిషి కొనసాగిస్తున్న కార్యకలాపాలే కారణం. ముఖ్యంగా చెరువులను పూడ్చి



ఆక్రమణకు పాల్పడటం, అక్కడే భవంతుల నిర్మాణాలు చేపట్టడం ఒకటి. నదులు, వాగుల వంటి జల ప్రవాహ మార్గాలను మూసివేయడం. వానలు కురవడానికి దోహదం చేసే అడవులను నరికివేయడం, నీటిని వృథా చేయడం. విపరీతమైన కాలుష్యంతో భూవాతావరణం వేడెక్కేలా చేయడం.

మన జిల్లాలో ఇలా..
ఎక్కడైనా దుర్భిక్ష పరిస్థితులు ఒక్కరోజులో తలెత్తవు. ప్రకృతిపై దశాబ్దాలుగా చేస్తున్న దాడులు.. ఏదో ఒకరోజు మనకు ఎదురుదెబ్బ కలిగిస్తాయన్నది విస్మరించడమే కారణం. ఉమ్మడి జిల్లాలోనూ జల వనరులు అడుగంటుతున్నాయి. అడవుల ఆక్రమణలు, వాతావరణ కాలుష్యమే ఇందుకు కారణం. వీటికి తోడు నీటి వృథా ఉంది. ఇప్పటికే అక్కడక్కడా జలవనరుల్లో కరవు పరిస్థితులు కనిపిస్తూనే ఉన్నాయి. భూగర్భ జలమట్టం పడిపోవడం, అడుగంటుతున్న జలాశయాలు ఇలాంటి అంశాలు కొంత ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ విషయంపై అధికారగణం అప్రమత్తం కావడం, ప్రజలు చైతన్యమై నీటి వృథా అరికట్టడానికి సిద్ధం కావాల్సిన తరుణమిది. ఉమ్మడి జిల్లాలో అక్కడక్కడా నీటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రస్తుతానికి తీవ్ర కరవు పరిస్థితులు లేవనే ధీమా ఉన్నా.. రాబోయే కాలంలో ఎలాంటి సమస్యలను దరిదాపుల్లోకి రానీయకుండా జాగ్రత్త పడాల్సిన అవసరముంది. అందుకు ఉమ్మడి జిల్లాలోని 28 లక్షల జనాభాలో ఒక్కో పౌరుడు రోజుకు ఒక లీటరు నీటిని పొదుపు చేసినా... అది నీటి బ్యాంకులో రోజుకు 28 లక్షల లీటర్లు అవుతుంది.

# బరువు సరిపోతే లైసెన్స్ ఖాయం!

హైదరాబాద్ : తూనికలు కొలతల శాఖలో లైసెన్స్‌హోల్డర్ల నియామకంలో అధికారులు నిబంధనలు విస్మరిస్తున్నారని.. డ్రైవర్లు, తమ సహాయకులకు బాధ్యతలు అప్పగిస్తున్నారన్న విమర్శలొస్తున్నాయి. వారిలో పలువురు కాటాల మరమ్మతులతో పాటు స్టాంపింగ్, వ్యాలిడిటీ సర్టిఫికెట్ జారీ చేయడానికి మామూళ్లు వసూలు చేసి ఇస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల మేరకు దరఖాస్తు చేసుకున్నా ముప్పుతిప్పలు పెడుతూ అడిగినంత చేతిలో పెట్టేవరకు కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని పలువురు వాపోతున్నారు.

పరిజ్ఞానంతో పనిలేదు..

డిప్యూటీ కంట్రోలర్, డిస్ట్రిక్ట్ ఇన్‌స్పెక్టర్ల పరిధిలో ఉండేవారికి లైసెన్స్‌హోల్డర్ బాధ్యతలు అప్పగిస్తారు. గతంలో ఎలక్ట్రానిక్స్‌లో డిప్లొమా అర్హత కలిగిన వారికి రాతపరీక్ష, ప్రాక్టికల్, వైవా నిర్వహించి ఉత్తీర్ణులైనవారికి ధ్రువ పత్రాలు ఇచ్చేవారు. అనంతరం వారు రిపేరింగ్ లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకునేవారు. అనంతరం వారిని లైసెన్స్‌హోల్డర్‌గా నియమించేవారు. వారు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కిరాణా జనరల్ స్టోర్లు ఐరన్, సిమెంట్ విక్రయాలు ఇతర ఉపకరణాల విక్రయ



కేంద్రాల్లో ఉండే కాటాలు, పరిశ్రమల్లో వినియోగించే డిజిటల్ కాటాలను పరిశీలించి మరమ్మతులు ఉంటే చేసి సర్వీస్‌ఛార్జీ తీసుకోవాలి. వ్యాలిడిటీ, స్టాంపింగ్ అవసరమైతే డిస్ట్రిక్ట్ ఇన్‌స్పెక్టర్ ద్వారా చేయించాలి. 2002 నుంచి ఎంపిక కోసం పరీక్షలు నిర్వహించడం లేదు. ప్రస్తుతం ఐటీఐ, డిప్లొమా, బీటెక్ (ఎలక్ట్రానిక్స్ లేదా మెకానికల్) అర్హత ఉంటే కాటాల పరిశీలన బాధ్యతలు అప్పగించవచ్చు. కొందరికి అలాంటి పరిజ్ఞానం లేకున్నా లైసెన్సింగ్ బాధ్యతలు అప్పగించి సొమ్ము చేసుకుంటున్నారన్న విమర్శలున్నాయి.

నిర్ణీత మొత్తం ఇస్తేనే..

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో మొత్తం 30కి మించి సిబ్బంది లేరు. రంగారెడ్డి జిల్లాలో రోజుకు 100.. మేడ్చల్ జిల్లాలో 60, హైదరాబాద్ జిల్లాలో 200 చొప్పున నిత్యం దరఖాస్తులు వస్తుంటాయి. లైసెన్స్ హోల్డర్లు పరిమితంగా ఉండటంతో.. పరిశ్రమల్లోని కాటాలకు స్టాంపింగ్, వ్యాలిడిటీ సర్టిఫికేట్ జారీ చేయాలంటే నిర్ణీత మొత్తం ఇస్తేనే చేస్తామంటూ చెప్పేస్తున్నారని పలువురు వాపోతున్నారు. ఇటీవల లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా ఓ అధికారి పట్టుబడ్డారు. అంతకుముందు ఆ అధికారి.. ఆ స్థానానికి వచ్చేందుకు రూ.50లక్షలు చెల్లించానని దరఖాస్తుదారులకు నేరుగా చెప్పినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో శాఖాపరంగా విచారణ జరిపి లైసెన్సింగ్ వ్యవస్థను ప్రక్షాళన చేయాలన్న డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.

# ఏం కాదనుకునేరు.. ఫైర్

హైదరాబాద్: రాజధాని పరిధిలోని మూడు జిల్లాల్లో ఏటా 1400కి పైగా అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇందులో 20 తీవ్ర, 35 మధ్యస్థ, 1300కి పైగా స్వల్పస్థాయి ఉంటున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పరిశీలిస్తే 65 శాతం రాజధాని పరిధిలోనే జరుగుతున్నాయి. ఈ ఘటనల్లో ఏటా కనీసం 8 మంది మృత్యువాత పడుతుండగా 50 మంది క్షతగాత్రులవుతున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న నిర్వాహకులు, నిర్మాణదారులపై కఠిన చర్యలు తీసుకునే అధికారం అగ్నిమాపక శాఖ అధికారులకు లేకపోవడంతో మరింతగా రెచ్చిపోతున్నారు. ఈ నేపథ్యంలో ఉల్లంఘనులపై కొరడా ఝుళిపించేలా చట్టంలో మార్పులు తేవాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

ఇప్పటికీ 25 ఏళ్ల నాటి చట్టమే..: ఇటీవల నాంపల్లి బజార్‌ఘాట్ ఘటనలో 9 మంది బలవ్వడానికి నివాస ప్రాంతాల్లో రసాయన డ్రమ్ములు నిల్వ ఉంచిన ఆ భవన యజమాని నిర్లక్ష్యమే కారణం. గతంలో రూబీ హోటల్ ఘటనలో అమాయకులు బలవ్వడానికి కారణం



హోటల్ యజమాని నిర్లక్ష్యమే. వాణిజ్య ప్రదేశాలు, నాంపల్లిలోని నివాస ప్రాంతాల్లో గల్లీకి 2–3 భవనాల్లో ఇలాంటి ఉల్లంఘనలే కనిపిస్తాయి. వెబ్‌సైట్‌లో వివరాల ప్రకారం.. హైదరాబాద్ జిల్లాలో ఇప్పటివరకు 325 కేసుల్లో విచారణ ప్రారంభమైంది. అందులో కేవలం 8 మందికి మాత్రమే జరిమానాతో ముగిసిపోగా, 30 కేసులను ఉపసంహరించుకున్నారు. 201 కేసుల్లో న్యాయస్థానం మార్పులు చేర్పులు చేయాలని సూచించింది. మరో 86 కేసులు వేర్వేరు కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 154 కేసులు విచారణ ప్రారంభం కాగా.. 71 కేసుల్లో జరిమానాలు, 56 కేసుల్లో న్యాయస్థానం మార్పులు చేసి సమర్పించాలని సూచించింది. 18 కేసులు వేర్వేరు కోర్టుల్లో పెండింగ్‌లో ఉండగా 9 కేసులను ఉపసంహరించుకున్నారు. రాజధాని పరిధిలో 36 మంది ఉల్లంఘనులకు నోటీసులు, 31 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు.

గరిష్ఠంగా మూడు నెలల జైలు..:

కేసులు నమోదు చేసినా నోటీసులు జారీ చేయడం మినహా అరెస్టుకు ఆస్కారం లేదు. కోర్టు వరకు వెళ్లినా విచారణ ఉండదు. చట్టంలో అనేక సెక్షన్లున్నా 90 శాతం కేసులు జరిమానాలతోనే ముగుస్తున్నాయి. గరిష్ఠంగా విధించే జైలుశిక్ష 3 నెలలు మాత్రమే. కొత్త చట్టం రూపొందించాల్సిన అవసరం ఉంది.

# సరిహద్దు దాటిస్తున్నారు



కామారెడ్డి : మహారాష్ట్ర దెగ్లూర్‌కు చెందిన ఇసుకాసురులు మద్నూర్, డోంగ్లీ మండలాల అధికారులను మచ్చిక చేసుకుని సిర్‌పూర్, కుర్లా మంజీర పరివాహక ప్రాంతం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఒకటి, రెండు కాదు ఏకంగా యాభై నుంచి వంద ట్రాక్టర్లలో రాత్రి వేళల్లో ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక దోపిడీ చేస్తున్నారు. నెలరోజులుగా ఈ దందా మూడు పువ్వులు ఆరు కాయలు అనే చందంగా సాగుతోంది. స్థానిక పోలీసు, రెవెన్యూ అధికారుల అండదండలతోనే ఇసుకను సరిహద్దు దాటిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

వందల క్యూబిక్ మీటర్ల మేర..జిల్లాలోని వాగులు, వంకలతో పాటు మంజీరలో అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. దీంతో జిల్లాకు చెందిన స్థానికులు ఇసుక తవ్వకాలను పూర్తిగా నిలిపివేశారు. దీనికి తోడు మంజీర ఇసుక నాణ్యంగా ఉండడంతో జిల్లాతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో విపరీతమైన డిమాండ్ నెలకొంది. దీన్ని అవకాశంగా తీసుకున్న మహారాష్ట్ర దెగ్లూర్‌కు చెందిన ఇసుకాసురులు నదిని గుల్లచేస్తున్నారు. పొక్లెయిన్‌తోనే తవ్వకాలు చేస్తున్నారంటే ముఠా ఎంతకు తెగించిందో అర్థం చేసుకోవచ్చు. ట్రాక్టర్ల ద్వారానే రోజుకు వందల క్యూబిక్ మీటర్ల ఇసుకను తోడేస్తున్నారు. స్థానికులు ఇసుక తవ్వే పరిసర ప్రాంతాలకు రాకుండా ప్రైవేటు సైన్యం అడ్డుకోవడం గమనార్హం. జిల్లా సరిహద్దు ప్రాంతం కావడంతో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం అక్రమార్జనకు అలవాటు పడిన స్థానిక అధికారులకు కలిసివస్తోంది.

స్థానికులను భయపెడుతూ..

గతంలో జిల్లాకు చెందిన కొందరు మంజీరలో ఇసుక తవ్వి మహారాష్ట్రతో పాటు కర్ణాటక, హైదరాబాద్ ప్రాంతాలకు టిప్పర్లలో తరలించి సొమ్ము చేసుకునేవారు. ప్రస్తుతం మహారాష్ట్రకు చెందిన ఓ ముఠా రంగప్రవేశం చేసి దందా మొదలుపెట్టింది. దందాకు అడ్డువచ్చే స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. అక్రమార్జనకు అలవాటు పడిన కొందరు పోలీసు, రెవెన్యూ అధికారులు వీరికి పరోక్షంగా అండగా నిలుస్తున్నారనే ఆరోపణలున్నాయి. అక్రమంగా ఇసుక తరలింపుపై మద్నూర్ పోలీసులతో పాటు ఇతర అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని సిర్‌పూర్ గ్రామస్థులు చెబుతున్నారు.

పోలీసులకు నివేదించిన రెవెన్యూ అధికారులు

నూతనంగా ఏర్పడిన డోంగ్లీ మండల రెవెన్యూ అధికారులు మహారాష్ట్ర ఇసుకాసురుల దందాను అడ్డుకోవాల్సిందిగా మద్నూర్ పోలీసు అధికారులకు విన్నవించారు. దందాను అడ్డుకునేందుకు సరిపడా సిబ్బంది లేకపోవడంతో పాటు ఎన్నికల విధుల కారణంగా అక్రమంగా ఇసుక తరలింపుపై ఉక్కుపాదం మోపాలని సూచించింది. దీంతో పాటు డివిజన్, జిల్లా ఉన్నతాధికారులకు మంజీర పరివాహక ప్రాంతంలో జరుగుతున్న ఇసుక దోపిడీని లేఖల ద్వారా తెలియజేసినా ప్రయోజనం లేకుండా పోతోంది.

మామూళ్ల మత్తులో యంత్రాంగం

ఇసుక దందాను అడ్డుకోవాల్సిన యంత్రాంగం మామూలుగా తీసుకుంటోందని రైతులు ఆరోపిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు రేటు కట్టి వసూళ్లు చేస్తున్నారనే విమర్శలున్నాయి. మామూళ్లు ముట్టచెప్పని ట్రాక్టర్లనే పట్టుకుని హడావుడి చేస్తున్నారని పేర్కొంటున్నారు. ఆయకట్టు రైతులకు జీవనాడిగా మారిన మంజీరను గుల్ల చేస్తే భూగర్భజలాలు అడుగంటిపోయి బోర్లు వట్టిపోనున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని మామూళ్ల అధికారుల భరతం పట్టాలని రైతులు కోరుతున్నారు.

అక్రమ తవ్వకాలపై చర్యలు

– రేణుకా చౌహాన్, తహసీల్దార్, డోంగ్లీ

సిర్‌పూర్, కుర్లా ప్రాంతాల్లో ఇసుక అక్రమ తరలింపును అడ్డుకునేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నాం. సిబ్బంది కొరత కారణంగా అక్రమార్కులు రాత్రివేళల్లో తరలిస్తున్నారు. అక్రమ దందాపై పోలీసులతో పాటు డివిజనల్, జిల్లా స్థాయి అధికారులకు సైతం నివేదించాం. మరింత కట్టుదిట్టం చేసి అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రయత్నాలు చేస్తాం.

# శాశ్వత చర్యలేవీ?

కరీంనగర్ : కొండగట్టు ఘాట్‌రోడ్డుపై ప్రమాదాల నివారణకు అధికారులు శాశ్వత చర్యలు చేపట్టడంలేదు. శనివారం ఉదయం కొండగట్టు అంజన్న దర్శనం తర్వాత మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం మ్యాదరిపేట గ్రామానికి చెందిన 11 మంది భక్తులు ఆటోలో కిందికి దిగుతుండగా అదుపుతప్పి బోల్తాపడగా 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. 2018 సెప్టెంబరు 11న ఆర్టీసీ బస్సు అదుపుతప్పి లోయలోపడ్డ సంఘటనలో 65 మంది ప్రయాణికులు మృతి చెందగా కొడిమ్యాల, మల్యాల మండలాల్లోని బాధిత కుటుంబాలు నేటికీ కోలుకోవడం లేదు.

2018లో ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్ర ప్రాణనష్టం జరగడంతో అప్పటి ప్రభుత్వం ఘాట్‌రోడ్డును పూర్తిగా మూసివేసి వాహనాల రాకపోకలను నిషేధించింది. ఆర్‌అండ్‌బీ అధికారులు కొండపైన 'వై' జంక్షను, ఘాట్‌రోడ్డు చివరి మలుపు వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయడంతోపాటు మధ్యలో పలుచోట్ల రహదారికి ఇరువైపులా రక్షణ గోడలు, వేగనియంత్రికలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. దాదాపు రూ.80 లక్షలకుపైగా ఖర్చు చేసినప్పటికీ నాలుగేళ్లకుపైగా వాహనాలకు అనుమతి నిషేధించారు. దీంతో కొండగట్టు(దిగువ) ప్రాంతంలో చిరువ్యాపారులు పలుమార్లు ఆందోళనకు దిగారు. స్థానిక వ్యాపారుల డిమాండ్‌తో అప్పటి మంత్రి ఈశ్వర్, ఎమ్మెల్యే రవిశంకర్ ప్రభుత్వం నుంచి అనుమతి పొంది ఘాట్‌రోడ్డును పునఃప్రారంభించారు. నాలుగేళ్ల తర్వాత ఘాట్‌రోడ్డుపై నుంచి వాహనాలను అనుమతించడంతో వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రతిపాదనల్లోనే రెండో ఘాట్‌రోడ్డు

ఘాట్‌రోడ్డుపై భారీ ప్రమాదం జరిగిన దృష్ట్యా ప్రభుత్వం రెండో ఘాట్‌రోడ్డు నిర్మాణం చేపట్టాలని భావించింది. ఇందుకోసం ఆర్‌అండ్‌బీ అధికారులు స్థల సర్వే చేపట్టారు. ప్రస్తుతమున్న ఘాట్‌రోడ్డుపై ప్రమాదకర ప్రాంతాల్లో వాలు తగ్గించడంతోపాటు దాదాపు 2 కి.మీ దూరం ఘాట్‌రోడ్డును డబుల్‌రోడ్డుగా విస్తరించాలని ఇంజినీరింగ్ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ప్రతిపాదనలు నేటికీ అమలుకు నోచుకోలేదు.


న్యూట్రల్‌లో కాకుండా..ఘాట్‌రోడ్డుపై నుంచి కిందకు దిగే వాహనాలు న్యూట్రల్‌లో కాకుండా వేగం తగ్గించి దిగాలి. చాలామంది డ్రైవర్లు ఇంధనం ఆదా కోసం వాహనాన్ని న్యూట్రల్‌లో నడపడంతో వేగం పుంజుకుంటుందని, ఆ సమయంలో గేరు, బ్రేకు కూడా పనిచేయవని నిపుణులు పేర్కొంటున్నారు. అదే కారణంతో 2018లో ఆర్టీసీ బస్సు ఘాట్‌రోడ్డుపై అదుపుతప్పి పెద్ద కుదుపులతో లోయలోపడ్డట్లు అప్పట్లో రవాణాశాఖ ఉన్నతాధికారులు వెల్లడించారు. ప్రమాదం తర్వాత ఘాట్‌రోడ్డుపై వేగనియంత్రికలను తక్కువ ఎత్తుతో నిర్మించి హెచ్చరిక బోర్డులు అమర్చారు. ప్రస్తుతం స్పీడ్‌బ్రేకర్లపై రంగులు వెలసిపోవడంతో కనిపించడంలేదు. పలుచోట్ల హెచ్చరిక బోర్డులు కూడా మాయమయ్యాయి. ఘాట్‌రోడ్డు మధ్యలో కూడా రక్షణ సిబ్బందిని ఏర్పాటు చేసి వాహనాలు వేగంగా వెళ్లకుండా నియంత్రించాలని భక్తులు సూచిస్తున్నారు. వేగనియంత్రికలు రాత్రివేళల్లో కూడా స్పష్టంగా కనిపించే విధంగా రేడియంతో స్టిక్కర్లు ఏర్పాటు చేయాలి.

# కొత్త ప్రపంచం సృష్టించేద్దాం

హైదరాబాద్ : భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న సినిమాలు.. టీవీ సీరియళ్లలో సింహభాగంగా మారిన విజువల్ ఎఫెక్ట్స్, యానిమేషన్ రంగాల్లో జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం విద్యార్థులు ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. ఫైన్‌ఆర్ట్స్ కోర్సులు పూర్తిచేసిన యువ ఇంజినీర్లు, ఫైనలియర్ విద్యార్థులు భారీ చిత్రాలకు వీఎఫ్‌ఎక్స్ హంగులు సమకూర్చుతున్నారు. గతంలో విదేశీ సంస్థలతో వీఎఫ్‌ఎక్స్ పనులు చేయించుకున్న వారు సైతం వీరిని సంప్రదిస్తున్నారు. ఫైన్‌ఆర్ట్స్ పూర్తిచేసిన వారికి గతంలో పరిమితంగా అవకాశాలుండేవని, ప్రస్తుతం వారి సృజనకు తగిన అవకాశాలు లభిస్తున్నాయని జేఎన్‌ఏఎఫ్‌యూ ఐటీ సెల్ సమన్వయకర్త ఎస్.రవికిరణ్ తెలిపారు. సాంకేతిక నిపుణులకు సహాయకులుగా పనిచేస్తున్న వారికి రూ.లక్షల్లో పారితోషికాలు పొందుతున్నారన్నారు.

గ్రాఫిక్స్‌లో కృత్రిమ మేధ

పాన్ ఇండియా స్థాయి చిత్రాలు, ప్రత్యేకంగా ఓటీటీ సినిమాలు పెరుగుతుండడంతో సాంకేతిక నిపుణులకు నాలుగైదేళ్లుగా గిరాకీ బాగా పెరిగింది. సూక్ష్మ సన్నివేశాలను కూడా అద్భుతంగా తెరపై కనిపించాలంటూ దర్శక, నిర్మాతలు శ్రద్ధ చూపుతుండడంతో గ్రాఫిక్స్‌లోనూ కృత్రిమ మేధ వినియోగం పెరుగుతోంది. ఆయా సంస్థల నిర్వాహకులు హైదరాబాద్‌లో యానిమేషన్, వీఎఫ్‌ఎక్స్ పనులు చేస్తున్న స్టూడియోలతో కలిసి పని చేస్తున్నారు. వీఎఫ్‌ఎక్స్‌తో పాటు కృత్రిమ మేధ కోర్సును అదనంగా నేర్చుకుంటున్నారు. ఇలాంటి యువ ఇంజినీర్లు కొందరు ప్రముఖ నిర్మాణ సంస్థల్లో సహాయ సాంకేతిక నిపుణులుగా రాణిస్తున్నారు.



మల్టీ మీడియా వైపే మొగ్గు చూపుతున్నారు– డాక్టర్ రవికిరణ్, జేఎన్‌ఏఎఫ్‌ఏ యూనివర్సిటీసాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్‌లో కృత్రిమ మేధకు ప్రాధాన్యం పెరుగుతుండడంతో కొత్తగా ఇంజినీర్ల అవసరం తగ్గుతోంది. దీంతో మేము మల్టీమీడియా, జీఐఎస్ (మ్యాపింగ్)లను తప్పనిసరి చేశాం. మూడో సంవత్సరం నుంచే వారు సొంతంగా వీఎఫ్‌ఎక్స్‌లను రూపొందించేలా శిక్షణ ఇస్తున్నాం. కోర్సు పూర్తయ్యేలోపు ప్రముఖ సంస్థల్లో ఆఫర్లు వస్తున్నాయి.

సొంతంగా స్టూడియో ప్రారంభించా– హర్షిత్, ఫైన్‌ఆర్ట్స్ ఇంజినీర్

బీటెక్ నాలుగో సంవత్సరంలోనే ముంబయిలోని ఓ వీఎఫ్‌ఎక్స్ కంపెనీలో అవకాశం వచ్చింది. అప్పుడే ఆదిపురుష్ సినిమాకు వీఎఫ్‌ఎక్స్ పనులు చేశాం. అనంతరం బెంగళూరులోని సంస్థలో పనిచేశా. తల్లిదండ్రులు, స్నేహితుల సహకారంతో ఇటీవల సొంతంగా స్టూడియో ప్రారంభించా.

# పెరిగిన రక్తశుద్ధి కేంద్రాలతో ఊరట

గోదావరిఖని : మారుతున్న ఆహారపు అలవాట్లు, మధుమేహం, అధికరక్తపోటు కారణంగా కిడ్నీలు విఫలం అవుతున్న బాధితుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. వయసుతో నిమిత్తం లేకుండా కిడ్నీ వ్యాధులు పెరగడంతో డయాలసిస్ చేయించుకోక తప్పని పరిస్థితి నెలకొంటోంది. ప్రస్తుతం మూత్రపిండ వ్యాధిగ్రస్తులకు అందుబాటులో రక్తశుద్ధి కేంద్రాలను విరివిగా ఏర్పాటు చేయడంతో పాటు వారికి పింఛను, ఉచిత బస్‌పాస్ సదుపాయం కల్పించడంతో కొంత ఉపశమనం లభిస్తోంది. ఒకప్పుడు రక్తశుద్ధి చేయించుకోవాలంటే హైదరాబాద్, కరీంనగర్, వరంగల్ తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇలా వారంలో రెండు, మూడు రోజులు రక్తశుద్ధి కోసం ఆయా ప్రాంతాలకు వెళ్లలేక తీవ్ర ఇబ్బంది పడుతూ పలువురు మృత్యువాత పడిన సంఘటనలు అనేకం. ప్రస్తుతం ఆ పరిస్థితుల్లేకుండా ఎక్కడికక్కడ రక్తశుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయడంతో మూత్రపిండ వ్యాధిగ్రస్తుల జీవనప్రమాణం పెరుగుతోంది. మూత్రపిండాలు చెడిపోయి వారంలో మూడు రోజులు క్రమం తప్పకుండా రక్తశుద్ధి చేయించుకుంటూ అవసరమైన పౌష్టికాహారం, తక్కువ మోతాదులో నీరు తీసుకుంటూ ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ వహిస్తూ ఆరు నుంచి పది సంవత్సరాల వరకు జీవనం సాగిస్తున్నవారు ఎందరో ఉన్నారు. బాధితులు ఆయా కేంద్రాలకు వచ్చేందుకు బస్సు, ఆటోలను ఆశ్రయిస్తుండగా ఆర్థికంగా ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ప్రభుత్వం ఆసరా పింఛను సైతం అందిస్తోంది. ఉచిత బస్‌పాస్ సదుపాయం వారికి బాసటగా నిలిచినట్లయింది.

పెరుగుతున్న బాధితులు

మూత్రపిండ వ్యాధిగ్రస్తులకు అతి దగ్గరలో రక్తశుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తుండగా ఆయా కేంద్రాల్లో రద్దీ సైతం భారీగానే ఉంటోంది. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి అర్ధరాత్రి వరకు కేంద్రాల్లో సిబ్బంది పనిచేయాల్సి వస్తుంది. ఒకొక్కరికి రక్తశుద్ధి చేయాలంటే తప్పనిసరిగా నాలుగు గంటల సమయం పడుతుండగా గోదావరిఖని కేంద్రంలోని ఐదు పడకల్లో ఒకే సారి ఐదుగురికి మాత్రమే రక్తశుద్ధి చేసే అవకాశముంటుంది. ఇలా ప్రతి నాలుగు గంటలకోమారు షిఫ్టుల వారిగా నిత్యం సుమారు 20 నుంచి 25 మందికి రక్తశుద్ధి చేస్తుంటారు. ప్రతి నెల ఒకరిద్దరు కొత్తగా వస్తూనే ఉన్నారు. పారిశ్రామిక ప్రాంతమైన గోదావరిఖనిలో గతంలో ఒక్క రక్తశుద్ధి కేంద్రం ఉండటంతో బాధితులు తీవ్ర ఇబ్బంది పడుతుండగా కొత్తవారిని చేర్చుకునే అవకాశం లేకపోవడంతో కరీంనగర్ తదితర ప్రాంతాలకు తరలించేవారు. తాజాగా పెద్దపల్లి, ధర్మపురిలో సైతం ఐదేసి పడకల చొప్పున రక్తశుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయడంతో గోదావరిఖని రక్తశుద్ధి కేంద్రంపై ఒత్తిడి తగ్గింది. మంథనిలో సైతం ఐదు పడకల సామర్థ్యంతో కేంద్రం ఏర్పాటు చేసినప్పటికీ వినియోగంలోకి రావాల్సి ఉంది.

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో డయాలసిస్ యూనిట్లు, బెడ్లను పరిశీలిస్తే కరీంనగర్‌లో–10, హుజూరాబాద్–5, గోదావరిఖని–5, జగిత్యాల–5, కోరుట్ల–5, ధర్మపురి–5, సిరిసిల్ల–5, వేములవాడ–5, పెద్దపల్లి–5 ఉన్నాయి. వీటిలో మొత్తం 758 మంది ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ పథకం కింద ఉచితంగా డయాలసిస్ సేవలు పొందుతున్నారు. ఈ పథకం వర్తించని మరో 150 మంది వివిధ ప్రైవేటు ఆసుపత్రుల్లో సొంత ఖర్చులతో రక్తశుద్ధి చేయించుకుంటున్నారు.

వ్యాధిగ్రస్థులకు 'నీడ' అండ

మూత్రపిండ వ్యాధిగ్రస్థులకు రామగుండం ప్రాంతానికి చెందిన 'నీడ' స్వచ్ఛంద సంస్థ గత నాలుగైదేళ్లుగా సేవలందిస్తోంది. గతంలో ఆసరాతో పాటు ఉచిత బస్‌పాస్ సదుపాయం లేని రోజుల్లో రక్తశుద్ధి కోసం వచ్చేందుకు వారు తీవ్ర ఇబ్బంది పడుతుండేవారు. దీనిని గమనించిన నీడ స్వచ్ఛంద సంస్థ దాతల సహకారంతో ఒకొక్కరికి నెలకు రూ.521 చొప్పున పింఛను చెల్లింపునకు శ్రీకారం చుట్టింది. రామగుండంతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని మూత్రపిండ వ్యాధిగ్రస్తులను గుర్తించి పింఛను చెల్లించగా ప్రస్తుతం రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని వారికి మాత్రమే చెల్లిస్తున్నారు.

# ఇసుక మాఫియా ఇష్టారాజ్యం

అయిజ : ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఇసుక అక్రమ రవాణా జోరు తగ్గడంలేదు. రాత్రింబవళ్లు తేడా లేకుండా అడ్డదారుల్లో రవాణా చేస్తున్నారు. మాఫియాకు అన్ని రకాల అడ్డదారులు తెలిసుండటమే దీనికి కారణం. తుంగభద్ర నదిలో అధికారికంగా గద్వాల జిల్లా వ్యాప్తంగా ఆరు రీచ్‌లు ఏర్పాటు చేశారు. మరో ఆరుచోట్ల అడ్డదారిన అక్రమార్కులు ఇసుకను తోడేస్తున్నారు. రోజుకు రూ.5.40 లక్షల మేర ప్రభుత్వాదాయానికి గండి పడుతోంది. పెద్దల అండదండలు ఉండటంతో వారు ఆడిందే ఆట పాడిందే పాటగా నడిచింది. ఇసుక మాఫియా వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఇటీవల కాలంలో ఇసుక అక్రమ రవాణ వాహనాలు అధిక సంఖ్యలో పట్టుబడుతుండటమే దీనికి కారణం. అడ్డదారులే లక్ష్యంగా..: తుంగభద్ర నది నుంచి అడ్డదారుల్లో ఇసుకను తరలిస్తూ చివరకు హైదారాబాదు వరకు తీసుకెళ్తున్నారు. నది నుంచి ఎక్కడెక్కడ అడ్డదారులున్నాయి, ఏయే మండలాల పరిధిలో దారులు ఎలా ఏర్పాటు చేశారనేదానిపై అధికారులు తాజాగా ఆరా తీస్తున్నారు. ప్రధాన రహదారుల్లో అయితే అధికారుల కంటపడతారని ట్రాక్టర్లను అడ్డదారుల్లో తరలిస్తున్నారు. కొన్ని చోట్ల ఏకంగా పొలాల్లో అడ్డదిడ్డంగా తీసుకెళ్తున్నారు. వేసవిలో పంటలు లేకపోవడం, నదిలో నీళ్లు లేకపోవడం ఇసుక మాఫియాకు కలిసొచ్చింది. దాడుల్లో అడ్డదారుల్లో నుంచి వచ్చి దొరికిన ట్రాక్టర్‌లే ఉంటున్నాయి. అధికారులు నేరుగా అనధికారిక రీచ్‌లపై దాడులు కొనసాగిస్తున్నారు. ఇవే అనధికారికి రీచ్‌లు..: గద్వాల జిల్లాలోని తుంగభద్ర నదిలో అధికారికంగా ఆరు ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేశారు. అయిజ మండలంలోని వేణిసోంపూర్, రాజోలి మండలంలోని పెద్ద ధన్వాడ, చిన్న ధన్వాడ, రాజోలి, తూర్పుగార్లపాడు, ఉండవల్లి మండలంలోని పుల్లూరు గ్రామాల సరిహద్దులోని నది వద్ద అధికారులు రీచ్‌లను ఏర్పాటు చేశారు. రీచ్‌ల నుంచి ట్రాక్టర్లు, టిప్పర్లతో ఇసుకను తోడేస్తు న్నాయి. ఎక్కడపడితే అక్కడ తోడి పెద్దపెద్ద గోతులు చేసేస్తున్నారు. నిబంధనల ప్రకారం మైనింగ్ శాఖ పేరుతో మీసేవలో ఒక కిలోమీటర్ దూరానికి రూ.85 చెల్లించాలి. గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల్లోని గ్రామాలకు ఇసుక చేరేందుకు ఆన్‌లైన్ చెల్లింపు ద్వారా ఒక ట్రాక్టర్ ఇసుకకు రూ.3,500 నుంచి రూ.4,000 వరకు వ్యయం అవుతోంది.

రూ.1.62 కోట్ల అక్రమం..: ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న ట్రాక్టర్లు ఆఫ్‌లైన్ ద్వారా ఇసుకను చేరవేస్తున్నాయి. జిల్లాలోని ఆరు రీచ్‌ల పరిధిలో సుమారు 1,200 ట్రాక్టర్లు ఇసుకను తరలించేందుకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాయి. దాదాపు 30 శాతం అక్రమ మార్గంలో తరలిస్తున్నారు. రోజుకు సుమారు 360 ట్రాక్టర్ల ఇసుక అక్రమ మార్గంలో తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తే రూ.1,500 ప్రభుత్వ ఖాతాలో జమవుతుంది. ఈ ప్రకారం రోజూ రూ.5.40 లక్షలు అంటే నెలకు రూ.1.62 కోట్ల మేర, ఏడాదికి రూ.19.71 కోట్ల మేర ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు: ఇసుక తరలింపులో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకొంటాం. అనుమతి లేకుండా తరలిస్తే వెంటనే కేసులు నమోదు చేస్తాం. ఇసుక ర్నీ వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశాం. ఎక్కడికక్కడ అక్రమ తరలింపును అడ్డుకుంటాం.

# తెలంగాణ భవన్‌లో ఘనంగా ఉగాది వేడుకలు.. హాజరైన కేటీఆర్



హైదరాబాద్ : శ్రీ క్రోధి నామ సంవత్సర తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలు తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఉగాది పర్వదినం సందర్భంగా ఏర్పాటు చేసిన ఉగాది వేడుకల్లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. వేదపండితులు వేదాశీర్వచనం అందించారు. అనంతరం పంచాంగం పఠనంలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో అసెంబ్లీ మాజీ స్పీకర్ మాజీ పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు,ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**తెలుగు ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు : కేటీఆర్** : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. ప్రపంచంలోని తెలుగు ప్రజలందరికీ శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ఉగాది వేడుకల్లో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రాజకీయాలు ఎప్పుడూ ఉంటాయి. పండుగపూట రాజకీయాలు మాట్లాడకూడదు. ఈ సంవత్సరం అందరికీ మంచి జరగాలి. మతకల్లోలాలు లేకుండా ప్రజలందరూ శాంతియుతంగా ఉండాలి. వ్యవసాయం బాగుండాలి. వాతావరణ అనుకూల పరిస్థితులు రావాలని కేటీఆర్ ఆకాంక్షించారు.

# భారాస ఎమ్మెల్సీ కవిత జ్యుడిషియల్ కస్టడీ పొడిగింపు



దిల్లీ: దిల్లీ మద్యం కేసులో అరెస్టయిన భారాస ఎమ్మెల్సీ కవిత జ్యుడిషియల్ కస్టడీని ఈ నెల 23 వరకు కోర్టు పొడిగించింది. 14 రోజుల కస్టడీ ముగియడంతో అధికారులు ఆమెను న్యాయస్థానంలో హాజరుపరిచారు. దిల్లీ మద్యం విధానం మనీలాండరింగ్ కేసు దర్యాప్తు కొనసాగుతోందని.. కవిత బయట ఉంటే దర్యాప్తును ప్రభావితం చేస్తారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వాదనలు వినిపించింది. జ్యుడిషియల్ కస్టడీని మరో 14 రోజులు పొడిగించాలని కోరింది. మరోవైపు కస్టడీ పొడిగింపు కోరేందుకు ఈడీ వద్ద కొత్తగా ఏమీ లేదని కవిత తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం.. జ్యుడిషియల్ కస్టడీని పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. కోర్టు హాలులో భర్త, మామను కలిసేందుకు జడ్జి అనుమతినివ్వడంతో.. వారు కవితను కలిశారు.

# మెట్రో ఆఫర్లు.. మరో ఆరు నెలలు పొడిగింపు



హైదరాబాద్ సిటీ: నగరంలోని మెట్రో రైళ్లలో ఆగిపోయిన ఆఫర్లను మరో ఆరు నెలల వరకు పొడిగించారు. ఉగాది పండుగను పురస్కరించుకుని ప్రయాణికుల సౌకర్యార్థం ఆఫర్లను కొనసాగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. గతేడాది సెప్టెంబర్ 23న ప్రారంభించిన సూపర్ సేవర్ ఆఫర్ - 59 ఈ ఏడాది మార్చి 31న ముగిసింది. దీంతో ఏప్రిల్ 1 నుంచి ఎల్అండ్‌టీ అధికారులు ఈ ఆఫర్‌ను రద్దు చేశారు. అలాగే స్మార్ట్ కార్డు, కాంటాక్ట్ లెస్ కార్డ్స్ లపై ఉన్న 10 శాతం రాయితీని ఎత్తివేశారు. మెట్రో స్టూడెంట్ పాస్‌ను తొలగించడంతో ఆయా వర్గాలకు చెందిన ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వేసవికాలం సమయంలో రద్దీ పెరగడంతో డిస్కౌంట్లను ఎత్తివేసి అధిక ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నారని ప్యాసింజర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ మెట్రో, ఎల్అండ్‌టీ అధికారులు స్పందించి ఆయా ఆఫర్లను తిరిగి కొనసాగిస్తున్నట్లు సోమవారం ప్రకటించారు.

రూ.59తో నడిచే సూపర్ సేవర్ మెట్రో హాలిడే కార్డు, మెట్రో స్టూడెంట్ పాస్, సూపర్ ఆఫ్ పీక్ అవర్ ఆఫర్లు నేటి నుంచి ఆరునెలలపాటు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఈ సందర్భంగా హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, ఎల్అండ్‌టీ ఎండీ కేవీబీ రెడ్డి మాట్లాడుతూ ప్రయాణికులకు సౌకర్యవంతమైన రవాణాను అందించేందుకు హైదరాబాద్ మెట్రో రైలు కట్టుబడి ఉందన్నారు. ప్రయాణికులు ఆఫర్లను సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

# విజిలెన్స్ డీజీ రాజీవ్ రతన్ హఠాన్మరణం



హైదరాబాద్: విజిలెన్స్ డీజీ, సీనియర్ ఐపీఎస్ అధికారి రాజీవ్ రతన్ కన్నుమూశారు. మంగళవారం ఉదయం ఆయనకు గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు నగరంలోని ఏఐజీ ఆస్పత్రికి తరలించారు.

అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. రాజీవ్ రతన్ గతంలో కరీంనగర్ ఎస్పీగా పనిచేశారు. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గానూ బాధ్యతలు నిర్వర్తించారు.

**సీఎం రేవంత్ దిగ్భ్రాంతి** : రాజీవ్ రతన్ హఠాన్మరణంపై సీఎం రేవంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. సమర్థంగా పనిచేసిన అధికారులను తెలంగాణ సమాజం మరిచిపోదన్నారు.


ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్

9440977660, 9110718194




# నా వ్యక్తిగత ప్రతిష్టను దిగజార్చారు.. లిక్కర్ కేసులో నేను బాధితురాలిని

న్యూఢిల్లీ : మనీలాండరింగ్ కేసులో అరెస్టు అయి తీహార్ జైల్లో జ్యుడిషియల్ కస్టడీలో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత నాలుగు పేజీల లేఖ విడుదల చేశారు. నేటితో జ్యుడిషియల్ కస్టడీ ముగియడంతో కవితను కోర్టులో హాజరుపరిచారు. మళ్లీ రెండు వారాల పాటు కవితకు జ్యుడిషియల్ కస్టడీ పొడిగించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడేందుకు జడ్జి అనుమతించలేదు. కోర్టులో మాట్లాడేందుకు జడ్జి అనుమతించకపోవడంతో ఎమ్మెల్సీ కవిత నాలుగు పేజీల లేఖను విడుదల చేశారు. లిక్కర్ కేసుతో నాకు ఎలాంటి సంబంధం లేదు. నేను తప్పు చేశాననడానికి ఆధారాల్లేవు. రెండున్నరేళ్ల విచారణలో ఎలాంటి ఆధారాలు లభించలేదు. వేరే వ్యక్తుల స్టేట్‌మెంట్‌తో నన్ను అరెస్టు చేశారు. నేను ఎలాంటి ఆర్థిక లబ్ది పొందలేదు. ఈ వ్యవహారంలో నేను బాధితురాలిని. రెండేళ్ల నుంచి కేసు విచారణ ఎటు తేలడం లేదు. సీబీఐ, ఈడీ ఇన్వెస్టిగేషన్ కన్నా మీడియా విచారణ ఎక్కువగా జరుగుతుంది. వ్యక్తిగతంగా, రాజకీయంగా నా ప్రతిష్టను దిగజార్చారు. నా మొబైల్ నంబర్‌ను అన్ని ఛానల్స్‌లో వేసి, నా ప్రైవసీకి భంగం కలిగించారు అని కవిత పేర్కొన్నారు. ఈడీ, సీబీఐ అడిగిన ప్రశ్నలన్నింటికీ సమాధానం చెప్పాను. ఇప్పటికే నాలుగు సార్లు విచారణకు హాజరయ్యాను. బ్యాంకు వివరాలతో పాటు ఇతర బిజినెస్ వివరాలను కూడా ఇచ్చాను. గత రెండున్నరేండ్ల నుంచి విచారణ పేరుతో మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారు. ఇవాళ ఈడీ, సీబీఐ కేసులను పరిశీలిస్తే.. ఒక 95 శాతం కేసులు ప్రతిపక్ష పార్టీలపైనే ఉన్నాయి. బీజేపీలో చేరిన వెంటనే కేసుల విచారణ ఆగిపోతుంది. పార్లమెంట్ సాక్షిగా విపక్ష నేతలను ఉద్దేశించి నోరు మూసుకోకపోతే ఈడీని పంపుతామని బీజేపీ నేతలన్నారు. ఇలా బీజేపీ నాయకులు బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఈ కేసులో విచారణకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నాను. నా కుమారుడి పరీక్షల దృష్ట్యా బెయిల్ ఇవ్వాలని మళ్లీ కోరుతున్నాను. ఎందుకంటే నా కుమారుడి బోర్డు ఎగ్జామ్స్‌పై ప్రతికూల ప్రభావం పడొద్దనే ఉద్దేశంతో, ఈ సమయంలో తనతో నేను ఉండాలి. కాబట్టి బెయిల్ ఇవ్వాలని కోరుతున్నానని కవిత లేఖలో పేర్కొన్నారు.




# ఎక్కడి మండవ? ఎక్కడి ఖమ్మం? తెరపైకి అనూహ్యంగా పేరు

తెలంగాణలోని అధికార కాంగ్రెస్ పార్టీ మూడు లోక్ సభ సీట్లపై ఎటూ తేల్చడం లేదు. ఆయన కాదు ఈయన.. ఈయన కాదు ఆయన అంటూ సాగదీస్తోంది. అయితే, ఎన్నికలకు ఇంకా సమయం ఉండడంతో ఇప్పటికిప్పుడు హడావుడి పడాల్సిన అవసరం లేదు. కానీ, రెండు ప్రత్యర్థి పార్టీలు అభ్యర్థులను తేల్చేసిన నేపథ్యంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ కూడా ముందంజ వేయాల్సిన అవసరం ఉంది.

**ఆ గుమ్మంలో వలస నేతలు** : తెలంగాణలోని మిగతా అన్ని జిల్లాల కంటే ఖమ్మం ప్రత్యేకత వేరు. రాష్ట్రంలో పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కు ఈ జిల్లాలో పట్టు అంతంతమాత్రమే. మొదటినుంచి కాంగ్రెస్, కమ్యూనిస్టుల అడ్డా అయిన ఖమ్మంలో 2019లో మాత్రమే నెగ్గింది. అది కూడా 2018 అసెంబ్లీ ఎన్నికలు నెగ్గిన ఊపులో మాత్రమే. ఇప్పుడు అధికారం 2009లో టీడీపీ, 2014లో వైసీపీ గెలుపొందాయి. మిగతా అన్నిసార్లూ కాంగ్రెస్, వామపక్షాలే నెగ్గాయి. అయితే, ఖమ్మం మరో ప్రత్యేకత ఏమంటే ఇతర జిల్లాల నుంచి వచ్చినవారిని ఏమాత్రం సంకోచం లేకుండా గెలిపించడం. ఇలానే పీవీ రంగయ్యనాయుడు, నాదెండ్ల భాస్కరరావు, రేణుకాచౌదరి ఇక్కడినుంచి విజయం సాధించారు.

**ఈసారి ఆయన.?** : తెలంగాణలో ఖమ్మం, కరీంనగర్, హైదరాబాద్ స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులను ఇంకా ప్రకటించలేదు. వీటిలో ఖమ్మం నుంచి డిప్యూటీ సీఎం భట్టి భార్య, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు, తుమ్మల నాగేశ్వరరావు కుమారుడు టికెట్ ఆశిస్తున్నారు. ఈ ముగ్గురు నాయకుల నియోజకవర్గాలూ ఖమ్మం లోక్ సభ పరిధిలోనే ఉండడంతో పాటు బలమైన నాయకులు కావడంతో కాంగ్రెస్ ఏమీ తేల్చడం లేదు. ఇప్పుడు తాజాగా ఓ కొత్తపేరు తెరపైకి వచ్చింది. ఆయనే ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా పనిచేసిన మండవ వెంకటేశ్వరరావు. మండవ నిజామాబాద్ జిల్లాకు చెందినవారు. ఈయన పూర్వీకులు ఆంధ్రా ప్రాంతం నుంచి వచ్చి స్థిరపడ్డారు. అయితే, మండవ పూర్తి నేపథ్యం తెలంగాణనే. అనూహ్యంగా ఆయనను కాంగ్రెస్ ఖమ్మం అభ్యర్థిత్వానికి పరిశీలిస్తోంది.

**గత ఎన్నికల్లో బీఆర్ఎస్ లోకి** : 2019 లోక్ సభ ఎన్నికల సందర్భంగా మండవ ఇంటికెళ్లి మరీ ఆయనను పార్టీలో చేర్చుకున్నారు బీఆర్ఎస్ అధినేత, అప్పటి తెలంగాణ సీఎం కేసీఆర్. అంతకుముందు వరకు టీడీపీలోనే కొనసాగిన మండవ 20014 తర్వాత క్రియాశీల రాజకీయాలకు దూరమయ్యారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల ముంగిట కాంగ్రెస్ లో చేరారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి టీడీపీలో ఉండగా మండవతో సన్నిహితంగా మెలిగారు. తాజా అంచనాల ప్రకారం మండవకు కాంగ్రెస్ ఖమ్మం ఎంపీ టికెట్ దక్కితే గనుక కాస్త సంచలనమే. కొసమెరుపు: ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ టికెట్ కోసం మండవతో పాటు తీవ్రంగా పరిశీలిస్తున్న మరో పేరు రామసహాయం రఘురామిరెడ్డి. ఈ యన డోర్నకల్ దొరగా పేరుగాంచిన, వరంగల్ మాజీ ఎంపీ సురేందర్ రెడ్డి కుమారుడు. మంత్రి పొంగులేటి, సినీ హీరో విక్టరీ వెంకటేష్ కు స్వయానా వియ్యంకుడు.




# వరంగల్ లోక్‌సభ భారాస అభ్యర్థిత్వంపై ఉత్కంఠ !

భారాస వరంగల్ లోక్‌సభ అభ్యర్థిత్వంపై ఉత్కంఠ కొనసాగుతోంది. పార్టీ తరఫున ఎవరిని బరిలో దింపాలన్న విషయమై గులాబీ పార్టీ ఇంకా తేల్చుకోలేకపోతోంది. మాదిగ సామాజికవర్గానికి చెందిన స్థానిక నాయకుడిని బరిలో దింపాలని సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు సమాచారం. నాలుగైదు పేర్లపై చర్చించి నిర్ణయాన్ని అధినేత కేసీఆర్‌కు అప్పగించారు.

# పార్టీ పంచాంగం చెప్పిన జగ్గారెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 09: కాంగ్రెస్ పార్టీకి అవమానం తక్కువ, రాజపూజ్యం ఎక్కువ అని కాంగ్రెస్ పార్టీ నేత జగ్గారెడ్డి అన్నారు. మంగళవారం ఉగాది పర్వదినం నేపథ్యంలో ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. పార్టీకి రాజ పూజ్యం 16 ఉంటే.. అవమానం 2 ఉందని చెప్పారు. తాను పీసీసీ అధ్యక్ష పదవి అడగడం కొత్తేమి కాదన్నారు. అయితే అవకాశం వచ్చిన ప్రతీ సారి తాను పీసీసీ పీఠం అడుగుతానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. పీసీసీ పీఠం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇస్తే ఒకే.. అయితే రెడ్లలో ఎవరికైనా ఆ అవకాశం ఇస్తే మాత్రం.. ఆ పోటో పడే వారి జాబితాలో తాను సైతం ఉంటానని ఈ సందర్భంగా ఆయన కుండ బద్దలు కొట్టారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ కుటుంబానికి ఎల్లప్పుడు మంచి జరగాలని కోరుకుంటున్నానన్నారు. అయితే ఆ కుటుంబం అధికారం కోసం అడ్డదార్లు అయితే తొక్కలేదని ఆయన గుర్తు చేశారు. రాహుల్ గాంధీ కుటుంబం త్యాగాల కుటుంబమని అభివర్ణించారు. ఇక బీజేపీపై ఈ సందర్భంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ పదవుల కోసమే ఏర్పడ్డ పార్టీ అని చెప్పారు. రాజ్యాంగం తీసుకు వచ్చింది కాంగ్రెస్ పార్టీ అని.. అయితే కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డికి ఆ విషయంపై అవగాహన లేదని ఈ సందర్భంగా జగ్గారెడ్డి వ్యంగ్యంగా అన్నారు. అలాగే ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్‌పై జగ్గారెడ్డి ఈ సందర్భంగా పంచ్‌లు విసిరారు. ఆర్థిక వనరులు, బతుకు తెరువు కోసమే ప్రశాంత్ కిషోర్ సర్వే సంస్థను ఏర్పాటు చేసుకున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే మాదిగలు, మాలల పార్టీ అని.. మాదిగలు, మాలలు అంటేనే కాంగ్రెస్ పార్టీ అని ఈ సందర్భంగా అభివర్ణించారు. మీరా కుమార్, దామోదర రాజనర్సింహకు కాంగ్రెస్ పార్టీనే అవకాశం ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే బీజేపీ లాభం చేకూరేలా మంద కృష్ణమాదిగ మాట్లాడుతున్నారన్నారు. తాను ఒక కాంగ్రెస్ పార్టీ అభిమానిగా చెబుతున్నా.. రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కావాలని ఆయన ఆకాంక్షించారు. ఆ పార్టీకి రాహుల్ గాంధీనే రాజు అని ఆయన కుండ బద్దలు కొట్టారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓడినా.. గెలిచానా.. రాహుల్ గాంధీ మాత్రం రాజేనని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660